క్లుప్తంగా

రోడ్డు విస్తరణతో గ్రామస్తుల్లో గుబులు



పాలమాకులలో రోడ్డుకు ఇరువైపులా మార్కింగ్ చేస్తున్న సిబ్బంది

నంగునూరు(సిద్దిపేట): సిద్దిపేట నుంచి హన్మకొండ వరకు జరుగుతున్న నేషనల్ హైవే విస్తరణ పనులతో నంగునూరు మండలంలోని ముండ్రాయి, రాజగోపాల్‌పేట, పాలమాకుల, బద్దిపడగ గ్రామస్తుల్లో గుబులు నెలకొంది. ఆయా గ్రామాల్లో కొన్ని రోజులుగా రోడ్డు పక్కన ఉన్న ఇళ్లు, దుకాణ సముదాయాలకు మార్కింగ్ చేయడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సెంటర్ పాయింట్ నుంచి రోడ్డుకు ఇరువైపులా 50 మీటర్లు మార్కింగ్ చేస్తూ ఇళ్లను తొలగించాలని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అలాగే రోడ్డు విస్తరణలో భాగంగా కంకర పోసి వెంటనే రోలింగ్ చేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి



లైఫ్ స్కిల్స్ విత్అవుట్ స్కిల్స్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి

కొండపాక(గజ్వేల్): విద్యతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. మండల పరిధిలోని దుద్దెడలో జాగృతి ఫ్రెండ్స్ అసోసియేషన్ 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 150 మంది విద్యార్థులకు గురువారం ప్రతిభ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుదల, క్రమ శిక్షణతో చదువుకుంటే ఉన్నత స్థానాలకు చేరుకుంటారన్నారు. జాగృతి ఫ్రెండ్స్ సేవలు బాగున్నాయని కితాబిచ్చారు. అనంతరం గ్రామానికి చెందిన కోణం శ్రీకాంత్ రచించిన లైఫ్ స్కిల్స్ విత్అవుట్ స్కిల్స్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ బాలాజీ, మాజీ సర్పంచ్ పెద్దంకుల శ్రీనివాస్‌గౌడ్, జాగృతి ఫ్రెండ్స్ అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

26న ప్రజాహిత యాత్ర

బీజేపీ పార్లమెంటరీ ప్రభారీ చంద్రయ్య



కోహెడలో మాట్లాడుతున్న చంద్రయ్య

కోహెడ(హుస్నాబాద్): ఫిర్ ఏక్ బార్ మోదీ సర్కార్ అనే నినాదంతో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఈనెల 26వ తేదీన రెండోసారి ప్రజాహిత యాత్రను కొనసాగించనున్నట్లు బీజేపీ పార్లమెంటరీ ప్రభారీ మీసాల చంద్రయ్య తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ప్రజాహిత యాత్ర సన్నాహక సమావేశం మండల పార్టీ అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక అంబేద్కర్ చౌరస్తా నుంచి యాత్రను ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్‌కుమార్, సత్యనారాయణరావు, లక్ష్మారెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, మహేష్, సమ్మిరెడ్డి, వాసుదేవరెడ్డి, సందీప్, సతీశ్, జగన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కూరగాయ వ్యాపారుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న కూరగాయల వ్యాపారులు

గజ్వేల్‌రూరల్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఆర్డీవో బన్సీలాల్, మున్సిపల్ చైర్మన్ రాజమౌళికి గురువారం ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లోని కూరగాయ వ్యాపారులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు కూరగాయల వ్యాపారులు మాట్లాడారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో కూరగాయల విక్రయాలు జరుగుతుండటంతో మార్కెట్లో ఉన్న తమకు వ్యాపారాలు లేకుండా పోయాయన్నారు. మార్కెట్ నుంచి కిలో మీటర్ వరకు రోడ్డుపై ఎవరూ విక్రయాలు జరపకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేగాకుండా ప్రతీ బుధవారం అంగడి ఉండటంతో కొనుగోలుదారులు రావడంలేదని, అంగడిని మరో ప్రాంతానికి మార్చాలన్నారు. కార్యక్రమంలో కూరగాయల మార్కెట్ సంఘం అధ్యక్షుడు రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

దడపుట్టిస్తున్న దొంగతనాలు

- పక్షం వ్యవధిలో విద్యుత్ వైర్లు, నగలు అపహరణ
- పొలాలకు వెళ్లలేకపోతున్న రైతులు
- తీవ్ర భయాందోళనలో ప్రజలు
- చర్యలు చేపట్టాలని వేడుకోలు

ఇళ్లు, పొలాల్లో విలువైన వస్తువులు అపహరిస్తూ దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. అందినకాడికి చోరీలు చేస్తూ ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నారు. ఇళ్లకు తాళం వేసి బయటకు వెళ్లాలంటే జనం బెంబేలెత్తుతున్నారు. పక్షం రోజుల్లో నగలు, విద్యుత్ వైర్లు, నగదు ఎత్తుకెళ్లారు. దొంగల బెడద లేకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



విద్యుత్ వైర్లు ఎత్తు కెళ్లిన వెలికట్ట శివారులోని వెంచరు

కొండపాక(గజ్వేల్): మండలంలో రోజు రోజుకు దొంగతనాలు పెరిగిపోతుండటంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. విద్యుత్ వైర్లు, తాళాలు వేసి ఉన్న ఇండ్లలోని విలువైన వస్తువులు, నగలు, ఖరీదైన దుస్తులు, నగదు ఎత్తుకెళ్తున్నారు. వెలికట్ట గ్రామ శివారులో రాజీవ్ రహదారికి ఆనుకొని సర్వేనంబరు 310, 311, 312లోని పది ఎకరాల్లో సుమారు ఎనిమిదేళ్ల కిందట శ్రీసిద్ధి రియల్ ఎస్టేట్ వెంచర్, దాని పక్కనే మరో రెండు వెంచర్లు చేశారు. రెండు వెంచర్లలో 50 విద్యుత్ స్తంభాల ద్వారా విద్యుత్తు సరఫరా జరుగుతుంది. వెంచర్లలో ఇంటి నిర్మాణాలు పూర్తికాకపోవడంతో ఎవరూ నివాసం ఉండటం లేదు. ఇదే అదనుగా భావించిన దొంగలు సోమవారం రాత్రి 40 విద్యుత్ స్తంభాల నుంచి వైర్లను ఎత్తుకెళ్లారు. వీటి విలువ సుమారు రూ.20 లక్షల వరకు ఉంటుందని నిర్వాహకులు చెబుతున్నారు. ఒకరోజు ముందు ఇదే వెంచరు నుంచి సుమారు 300 గజాల దూరంలో ఉన్న మహాశక్తినగర్ కాలనీలోని వెంచరులో 70 విద్యుత్ స్తంభాల నుంచి వైరును ఎత్తుకెళ్లిన విషయం పాఠకులకు తెలిసిందే.

ఇళ్లలో చోరీలు

మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో చిలుముల కొండయ్య ఇంటికి తాళం వేసి పొలం పనులకు వెళ్లాడు. అతడి ఇంటి నుంచి రూ.3 లక్షల నగదు, రెండు తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. అలాగే మరో ఇద్దరు వడ్ల సత్తవ్వ, సున్నం రాజయ్యల ఇళ్లలో రూ.1.50 లక్షల నగదు, మూడు తులాల బంగారు ఆభరణాలు, ఖరీదైన దుస్తులు అపహరించారు. 15 రోజుల వ్యవధిలో రెండు వెంచర్లు, మూడు ఇళ్లలో దొంగతనాలు జరగడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పొలం పనులకు వెళ్లేవారు ఒకరు ఇంటికి కాపలా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. రాత్రి వేళ్లలో బోరుబావుల వద్దకు వెళ్లలేకపోతున్నామని వాపోతున్నారు. దొంగతనాలు పెరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడంలేదని స్థానికులు మండిపడుతున్నారు. పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి దొంగతనాలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పదోన్నతులతో మరింత బాధ్యత

ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాయికిరణ్



గజ్వేల్‌లోని ప్రభుత్వాసుపత్రిలో మాట్లాడుతున్న డాక్టర్ సాయికిరణ్

గజ్వేల్‌రూరల్: విధుల్లో బదిలీలు, పదోన్నతులు మరింత బాధ్యతను పెంచుతాయని గజ్వేల్ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాయికిరణ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసిన పలువురు ప్రభుత్వ ఉద్యోగం సాధించిన వారికి వీడ్కోలు, కొత్తగా వచ్చిన వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చే వారికి ధైర్యం చెబుతూ వైద్యం అందించాలన్నారు. మెరుగైన సేవలందిస్తే మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ రాము, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గద్దెకు చేరిన సమ్మక్క

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పొట్లపల్లి సమ్మక్క సారలమ్మ జాతరకు భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారు. గురువారం రాత్రి సమ్మక్కను కోయ పూజారులు గద్దెకు చేర్చారు. తల్లి, బిడ్డలు గద్దెలకు చేరడంతో జాతర ప్రారంభమైనట్లు తెలిపారు. భక్తులు శుక్రవారం మొక్కులు సమర్పించుకుంటారని జాతర నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా ఫేర్‌వెల్ డే

సిద్దిపేటఅర్బన్: మండలంలోని ఎన్సాన్‌పల్లి తెలంగాణ రాష్ట్ర రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో గురువారం ఫేర్‌వెల్ డే జరుపుకున్నారు. కార్యక్రమానికి జ్యోతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పాండు, సెక్రటరీ శ్రీనివాస్ యాదవ్, ట్రెజరర్ వనజ, కాంగ్రెస్ పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు కలీముద్దీన్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి హాజరయ్యారు. గత సంవత్సరం ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో రాష్ట్ర స్థాయి మార్కులు సాధించిన విద్యార్థినులకు జ్యోతి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కూలీ మృతి

ములుగు(గజ్వేల్): ఆర్థిక సమస్యలతో తీవ్ర మనస్తాపానికిగురై కూలీ ఆత్మహత్యకు యత్నించాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గురువారం ములుగు పోలీస్ స్టేషన్‌హెడ్‌కానిస్టేబుల్ శేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన చెట్టి నాగరాజుగౌడ్(30) కూలీ పని చేస్తూ జీవనం సాగించేవాడు. ఆర్థిక సమస్యల కారణంగా మద్యానికి బానిసయ్యాడు. గ్రామస్తులు అతడికి పని ఇవ్వకపోవడంతో డబ్బులకు ఇబ్బంది ఏర్పడింది. దీంతో జీవితంపై విరక్తి చెంది ఈనెల 16వ తేదీ మధ్యాహ్నం ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. ఈ విషయం సాయంత్రం కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తెలిపాడు. కుటుంబీకులు వెంటనే చికిత్సకోసం మేడ్చెల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆ తరువాత మెరుగైన వైద్యం కోసం మండలంలోని లక్ష్మక్కపల్లి ఆర్‌వీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబల్ శేఖర్ తెలిపారు.

24లోపు దరఖాస్తు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈ శ్రీనివాసులు

చేర్యాల(సిద్దిపేట): ఉచిత విద్యుత్ పథకానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని విద్యుత్ వినియోగదారులకు డీఈ శ్రీనివాసులు సూచించారు. గురువారం పట్టణ కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్లో చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట మండలాల విద్యుత్ అధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహజ్యోతి పథకానికి అర్హులైన వారు ఈనెల 24లోపు విద్యుత్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే రబీ సీజన్‌లో రైతులకు వ్యవసాయానికి 24 గంటల కరెంట్ సరఫరా చేస్తామన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో డీఈఈ రత్నాచారి, ఏఈలు తబ్రీచ్, మధు, శ్రీనివాసరావు, లైన్ ఇన్స్‌పెక్టర్లు ప్రభాకర్‌రెడ్డి, రాంరెడ్డి, పాపిరెడ్డి, లైన్‌మెన్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు గృహలక్ష్మి వర్తింపజేయాలి

బెజ్జంకి(సిద్దిపేట): గృహలక్ష్మి పథకాన్ని అర్హులందరికీ వర్తింపజేయాలని ట్రాన్స్‌కో డీఈ శ్రీనివాసులు సిబ్బందిని ఆదేశించారు. బెజ్జంకిలో గురువారం బెజ్జంకి, కోహెడ మండలాలకు చెందిన ట్రాన్స్‌కో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహలక్ష్మి లింకేజీ ఇప్పటి వరకు 82 శాతం పూర్తయిందన్నారు. విద్యుత్ సమస్యలను దృష్టిలో ఉంచుకొని యాసంగి సీజన్‌కు సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో ఏడీఈ మాణిక్యాలు, తదితరులు పాల్గొన్నారు.

మాక్ పార్లమెంట్‌కు విద్యార్థుల ఎంపిక

సిద్దిపేట ఎడ్యుకేషన్: సంసద్ సంస్థ, ఇండియన్ యూత్ కాంగ్రెస్ సంయుక్త ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించే మాక్ పార్లమెంట్‌కు సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ తెలిపారు. గురువారం మాక్ పార్లమెంట్‌కు ఎంపికైన నలుగురు విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా నిర్వహించే మాక్ పార్లమెంట్ కార్యక్రమానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటారని, ఈసారి దేశవ్యాప్తంగా 5వేల మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. అందులో 150 మంది ఎంపిక కాగా కళాశాల నుంచి బీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు లతాశ్రీ, శ్రీవర్షిణి, ముక్తేశ్వరి, వైష్ణవి ఎంపిక కావడం గర్వంగా ఉందన్నారు. ఈనెల 24, 25 తేదీలలో న్యూఢిల్లీలోని ఎన్డీఎంసీ కన్వెన్షన్ హాల్లో జరిగే కార్యక్రమానికి విద్యార్థులు హాజరై జమిలీ ఎన్నికల విధానం, కాశ్మీర్ తదితర అంశాలపై ప్రసంగిస్తారని తెలిపారు. పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన వారికి రూ.2 లక్షల నగదు, సర్టిఫికెట్‌తో పాటు రానున్న రోజుల్లో సంసద్ సంస్థ ద్వారా ఇంటర్న్‌షిప్ అందిస్తారన్నారు.

సువర్ణప్రాసన సంస్కారం ప్రారంభం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో గురువారం సువర్ణ ప్రాశన సంస్కారం పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. పిల్లల్లో బుద్ధి మాంద్యం తగ్గించడానికి, మేధస్సు పెంచడానికి, నరాల వ్యవస్థ అభివృద్ధి చేయడానికి, రోగనిరోధక శక్తి పెంచడానికి, మెదడు అభివృద్ధి చెందడానికి ఈ సువర్ణ ప్రాసన సంస్కారం ఉపయోగ పడుతుందని పాఠశాల నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో శిశు మందిర్ ప్రధానాచార్యులు నరేష్‌కుమార్, ప్రబంధకారిణి సభ్యుడు బాలకృష్ణారెడ్డి, ఆచార్యుల బృందం, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హాఫ్ మారథాన్ పూర్తి చేయడం అభినందనీయం

హుస్నాబాద్: ఫిజికల్ డైరెక్టర్ హాఫ్ మారథాన్ పూర్తి చేసి యువతకు ఎంతో స్ఫూర్తినిచ్చారని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. గురువారం హుస్నాబాద్‌కు చెందిన ఫిజికల్ డైరెక్టర్ బూట్ల రాజమల్లయ్య తన పుట్టిన రోజు సందర్భంగా పట్టణంలోని గాంధీ చౌరస్తా నుంచి కొండాపూర్ గ్రామానికి మూడు సార్లు పరుగెత్తి 21 కిలో మీటర్ల దూరం పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత తమ ఫిట్‌నెస్ కోసం ప్రతీరోజు పరుగెత్తాలన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అనిత, హుస్నాబాద్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు లింగమూర్తి, హుస్నాబాద్ రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి

సీపీ అనురాధ



మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: గంజాయి, డ్రగ్స్, జూదం, పేకాట, ఇతర మత్తు పదార్థాల రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ అనురాధ అధికారులను ఆదేశించారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో గజ్వేల్ డివిజన్ పోలీసు అధికారులతో పెండింగ్ కేసులపై గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 9 తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించని వాహనదారులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ మహిళలకు సంబంధించిన కేసులలో ఎఫ్ఐఆర్ నుంచి చార్జీషీట్ వరకు క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండే విధంగా పరిశోధన జరగాలన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నమోదైన కేసులను త్వరగా విచారణ పూర్తి చేసి నాలుగు రోజుల్లో చార్జీషీట్ వేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, గజ్వేల్ ఏసీపీ బాలాజీ, సైబర్ పోలీసు స్టేషన్ ఏసీపీ శ్రీనివాస్, ట్రాఫిక్ ఏసీపీ సుమన్, గజ్వేల్ సీఐ సైదా, గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, తొగుట సీఐ లతీఫ్, గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ గురుస్వామి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నాడు నిరుపేద.. నేడు ప్రభుత్వ ఉద్యోగి



కరుణాకర్‌ను సన్మానిస్తున్న బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఐలయ్య

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండల కేంద్రానికి చెందిన తుప్పటి కరుణాకర్ చిన్నతనంలో కడు పేదరికం అనుభవించాడు. పట్టుదలతో ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాడు. కరుణాకర్ తండ్రి కనకయ్య 2004లో విద్యుదాఘాతంతో మృతి చెందాడు. తల్లి బీరవ్వ 2006 పిల్లలను వదిలిపెట్టి వెళ్లింది. దీంతో కరుణాకర్, చెల్లెలు అనాథలుగా మిగిలారు. తినడానికి తిండి లేని దీనస్థితిలో గట్టి సంకల్పంతో ప్రభుత్వ ఉద్యోగాన్ని సంపాదించాలని ముందుకు సాగాడు. ఈ క్రమంలోనే కష్టపడి చెల్లి పెళ్లి చేశాడు. వైద్యశాఖలో ప్రభుత్వం భర్తీ చేసిన ఉద్యోగాల్లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ప్రస్తుతం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వర్తిస్తున్నాడు. గురువారం బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు కందూరి ఐలయ్య కరుణాకర్‌కు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు, ఉద్యోగ సంపాదనకు పేదరికం అడ్డుకాదన్నారు. కరుణాకర్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నవీన్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ దేవాలయంలో చోరీ

గజ్వేల్‌రూరల్: దేవాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన గురువారం వెలుగుచూసింది. మండల పరిధి జాలిగామలోని ఎల్లమ్మ దేవాలయంలో హుండీలోవేసిన కానుకలు, తులంన్నర అమ్మవారి బంగారు ఆభరణాలు దొంగలు ఎత్తుకెళ్లారు. సీసీ కెమెరాల వైర్లను తొలగించి హార్డ్‌డిస్క్‌ను ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న చేర్యాల సీఐ శ్రీను

గజ్వేల్‌రూరల్: విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని గజ్వేల్ ఏఎస్ఐ సత్యనారాయణరెడ్డి అన్నారు. మండల పరిధిలోని జాలిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మహిళల రక్షణ చట్టాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సామాజిక రుగ్మతలపై గజ్వేల్ షీటీమ్ ఏఎస్ఐ శ్రీరాములుతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని, చదువుపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అపరిచితులకు వ్యక్తిగత సమాచారం తెలపొద్దన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం బస్వరాజు, ఉపాధ్యాయులు, షీటీమ్ సిబ్బంది శ్యామల, లావణ్య, మహేష్, రామచంద్రారెడ్డి, నవీన్‌రెడ్డి, స్వామి, గోవర్ధన్, విద్యార్థులు పాల్గొన్నారు.

అపరిచితుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

సిద్దిపేటకమాన్: అపరిచితులపట్ల జాగ్రత్తగా ఉండాలని చేర్యాల సీఐ శ్రీను అన్నారు. గురువారం చేర్యాలలోని ఓ హైస్కూల్‌లో మహిళల రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు బానిస కావొద్దు

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యార్థులు చెడు అలవాట్లకు బానిస కావొద్దని ఎస్ఐ భువనేశ్వర్ అన్నారు. గురువారం అక్బర్‌పేట- భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్ గ్రామ జెడ్పీ పాఠశాలలో సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మహిళల రక్షణ తదితర చట్టాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

ఖమ్మంపల్లి గ్రామస్తులు



ఖమ్మంపల్లి శివారులో గొడవ పడుతున్న గ్రామస్తులు

కొండపాక(గజ్వేల్): ప్రభుత్వ భూమిని కాపాడాలని గ్రామస్తులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మండలంలోని ఖమ్మంపల్లి గ్రామ శివారులోని 1060, 1061లోని సుమారు పదెరకాల ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గురువారం కబ్జా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు, గ్రామస్తులు తీవ్ర పరుష పదజాలంతో దూషించుకుంటూ గొడవకు దిగారు. ఒకదశలో దాడులు చేసుకునే స్థాయికి ఘర్షణ చేరుకుంది. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రెండు సర్వేనంబర్లలోని పదెకరాల భూమిని ఖమ్మంపల్లి గ్రామాభివృద్ధికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించింది. ఇదే భూమిని సిద్దిపేట, పరిసర గ్రామాల వ్యక్తులు కబ్జాకు యత్నించారు. ఈవిషయాన్ని గ్రామ ఎంపీటీసీ యాదగిరి, గ్రామస్తులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన కరువైంది. దీంతో ఈ విషయంపై ఇటీవల హైదారాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం అందజేసినట్లు ఎంపీటీసీ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేసినట్లు ప్రచారం సాగింది. కానీ, పోలీసులు మాత్రం తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మృతుడి కుటుంబానికి పరామర్శ

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని బేగంపేట గ్రామానికి చెందిన చిలుముల కొమురయ్య ఇటీవల దుబాయ్‌లో మృతి చెందాడు. విషయం తెలుసుకొని మృతుడి కుటుంబాన్ని గురువారం మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఇస్తారి తదితరులు ఉన్నారు.

◆ మండల స్థాయి జీవశాస్త్ర ప్రతిభాన్వేషణ పరీక్ష

జగదేవ్‌పూర్(గజ్వేల్): తెలంగాణ బయోసైన్స్ ఫోరం ఆధ్వర్యంలో గురువారం జగదేవ్‌పూర్‌లో మండలస్థాయి జీవశాస్త్రం ప్రతిభాన్వేషణ పరీక్షను బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. పరీక్షలో పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ఇంగ్లీష్ మీడియంలో తిగుల్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు హైమ, స్పందన, అనూష, తెలుగు మీడియంలో తిగుల్ పాఠశాల విద్యార్థిని కల్యాణి, ఇటిక్యాల పాఠశాల విద్యార్థులు శ్రావణి, నవ్య ప్రతిభ చాటారు. ప్రతిభ చాటిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, ఉపాధ్యాయులు మాధవరెడ్డి, శ్రీనివాస్, శివుడు, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

◆ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి భరత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. గతంలో అనేకసార్లు వినతి పత్రాలు, ఆందోళన కార్యక్రమాలు చేసినా ఫలితంలేకుండా పోయిందని మండిపడ్డారు. వచ్చే విద్యాసంవత్సరంలోనైన ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు ప్రకాష్, నవీన్, కిరణ్, భాను తదితరులు పాల్గొన్నారు.

◆ వైభవంగా కుంకుమార్చన

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయ పంచమ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఆలయంలో కుంకుమార్చన నిర్వహించారు. వార్షికోత్సవంలో భాగంగా అమ్మవారికి లలితా సహస్ర నామాలతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. గౌడసంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.

◆ నేత్రపర్వంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

నంగునూరు(సిద్దిపేట): కోనాయిపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం భూనీల సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, ధ్వజారోహణం, నిత్యహోమం జరిగాయి. సాయంత్రం ధ్వజారోహణం, సుదర్శన హోమం, పూర్ణాహుతి, నిత్యహోమం, చక్రస్నానం, స్వామివారి అభిషేకం నిర్వహించారు.

◆ బైక్‌పై అయోధ్యకు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండల యువకులు బైక్‌పై గురువారం అయోధ్యకు చేరుకున్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. ఈనెల 19వ తేదీన ముద్దాపూర్‌కు చెందిన వడ్లకొండ సాయికిరణ్, మేదినీపూర్‌కు చెందిన రెడ్డమైన శేఖర్ బైక్‌పై శ్రీరాముడి జన్మస్థలమైన అయోధ్యకు బయలు దేరారు. 1260 కిలోమీటర్లు ఉన్న అయోధ్యకు నాలుగు రోజుల్లో చేరుకున్నారు.

◆ యోగా శిక్షణను సద్వినియోగం చేసుకోండి

గజ్వేల్‌రూరల్: భగవాన్ శ్రీసత్యసాయి ధ్యానమండలి ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన ఉచిత అంతర్ముఖ యోగా శిక్షణ, మహిళా వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు రంజిత్, శ్రీనివాస్, రాధాకృష్ణ, సూర్యారావు గురువారం తెలిపారు. భిక్షమయ్య గురూజీ ప్రత్యక్ష పర్యవేక్షణలో శిక్షణా తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. 23వ తేదీన జగదేవ్‌పూర్‌లోని ఎస్‌వీ ఫంక్షన్‌హాల్‌లో, 26న గజ్వేల్ పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో, 29న కుకునూర్‌పల్లిలోని భగవాన్ సత్యసాయి మందిరంలో శిక్షణా కార్యక్రమం జరుగుతుందన్నారు. మొదటి రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, రెండోరోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగుతుందని తెలిపారు.